కల కావలసిన నిజం

"అడ్డచారల తాబొందుమీద వుప్పాడ సన్నజరీ కండువా వల్లెవాటు. ముద్దు ముద్దుగా వాటిని పొదివి పట్టుకొని గంటల మొలనూలు. మెడలో పైటమీద యెగుడుదిగుడుగా పచ్చల పతకం. ముక్కున నత్తూ బులాకినీ, చెవులకు జూకాలు, కర్ణ పువ్వులూ, జావిలీలూనూ; చేతులకు మురుగులు, మురిడీ గొలుసులు, పోచీలు, కంకణాలు, భుజబంధులు, శిరస్సున సూర్యుడు, చంద్రుడు, పాపిడీ పింఁరీలు, తమలపాకు, మొగలిరేకు, తెగబారెడు బంగారు జడ. దానికి గుత్తులు గుత్తులుగా గంటలు."

* * *

మొత్తానికి హైదరాబాదు నలుగురూ చెప్పుకొని సంతోషించతగ్గ పట్టణమనే వొప్పుకోవాలి. పట్నంలో దేనికైనా చోటుంటుంది. కళలకూ, సాహిత్యానికీ, సంస్కృతికీ మరీ ఎక్కువ చోటే ఉంటుంది. కనీసం వాటి పేరుమీదుగా చెలామణీ అయ్యే జనం ఎక్కువ. సంస్థలూ ఎక్కువే. అటువంటి చక్కని హైద్రాబాదులో మనబోటివారి సంస్కృతీ, సాహిత్యాలకూ, కళాపోషణకూ, చిహ్నాలని అంతా అనుకొని మురిసే రెండు భవంతులు వెలసి ఉన్నాయి. ఒకటి కళాభవనం, రెండోదేమో రవీంద్ర భారతి.

పోతే మూడేళ్ళ కిందట అనుకుందాం, ఒకానొకరోజు సాయంకాలం సుమారు ఏడు గంటల ప్రాంతాలలో రవీంద్రభారతి, ఆహూతులైన ప్రేక్షక జనంతో దాదాపు కిటకిటలాడి

పన్యాల రంగనాథరావు

పోతున్నది. ముందు వరసలలో మామూలు ప్రకారమే కొంత మంది మంత్రులూ, వారి కావలసినవారూ, పలువురు పలుకుబడిగల పెద్దలూ, ఆసీనులై ఉన్నారు. ఆనవాయితీ చొప్పున అయిదో వరస పత్రికలవారికి ప్రత్యేకించారు. ఆ వరస మధ్యలో కూర్చున్న ప్రసాదు, ఒక దినపత్రికలో రిపోర్టరుగా చేరి ఇంకా ఆరునెల్లు కూడా కాలేదు. అనగా పాత్రికే యుడు. తన వరసలో సీట్లన్నీ నిండి పోయి ఉన్నాయి. అంతా పత్రికల వారే. అందులో కొందరిని తను ఈ ఆరు నెల్లలోనూ, చాలాసార్లు చూసే ఉన్నాడు. ముఖపరిచయాలున్నాయి. వాళ్ళలో వాళ్ళకున్న 'రాజకీయాలు' ఇంకా ప్రసాదువరకూ రాలేదు గనక, అతనికి వారితో ప్రత్యేకమైన స్నేహాలు లేవు.

పత్రికా ప్రపంచంలో ప్రసాదుకు బాగా ఆప్తుడైనవాడు అప్పటికి ఒక్కడే ఉన్నాడు. అతను నిరంజన రెడ్డి. బాగా వున్నవాడే. మొదణ్ణించీ సినీమాలన్నా, సినీ పత్రికలన్నా, యావ జాస్తిగా ఉన్నవాడు. పెద్ద చదువుల జోలికి పోకుండా, సినీమా పత్రికలకి తరుచూ రాస్తూ, ఇప్పుడు ఒక సినీ వారపత్రిక్కి ప్రతినిధి అయి నాడు. అసలు ప్రసాదునికూడా పత్రిక ల్లోకి లాగింది రెడ్డే. కలిసి చదువుకునే రోజుల్లో స్నేహం ఎలా ఉండినా, పత్రికలో అడుగుపెట్టాక, ప్రసాదుకి రెడ్డితో సాన్నిహిత్యం ఎక్కువయిం దనుకోవాలి. ఇవాళ ప్రోగ్రాముకి ప్రసాదుతోపాటు రెడ్డీ రావలసిన వాడే. ప్రసాదు ఎంత కలయచూసినా రెడ్డి కనపడలేదు.

హాలులో లైట్లు ఆరిపోయినై. స్టేజిపైన ఫ్లడ్‌లైట్లు క్రమేపీ కాంతి వంతమైనై. ఆ కాంతిలో స్టేజిమీద కొచ్చి మధ్య నిలబడి నమస్కరిస్తున్న భంగిమలో ఉన్న దివ్యసుందర విగ్ర హాన్ని చూడగానే, క్షణకాలం నిశ్చే ష్టుడై వెంటనే తేరుకున్న ప్రసాదుకి రంగనాయిక జ్ఞాపకమొచ్చింది. ఈ గొడవలో, ముందు జరిగే ఎనౌన్స్ మెంటుగానీ, నేపథ్య సంగీతం గానీ, ప్రసాదు చెవిలోకి ఎక్కలేదు. అతని దృష్టి, స్టేజిపైన విగ్రహం మీదనే లగ్నమై ఉంది.

"రంగనాయిక!" అనుకున్నాడు ప్రసాదు.

బాగా ఇష్టమైన పుస్తకాలు ఎన్ని సార్లు చదివినా తనివితీరదు. రచ యితపట్ల ప్రత్యేకాభిమానం వల్ల కొందరికైతే, రచనలో 'వైశిష్ట్యం' వల్ల కొందరికి కొన్ని కొన్ని పుస్త కాలు అభిమాన గ్రంథాలవుతై. ముఖ్యంగా సాహిత్యాభిరుచీ, రచనా వ్యాసంగం కలవారికి ఈ జబ్బు

కొంచెం జాస్తి. ఈ తరం వారంతా ఈ విషయంలో చాలా ఆరోగ్యవంతులుగా కనిపిస్తారు. వారికిటువంటి అలవాట్లేవీ ఉంటున్నట్టు కనిపించదు.

ప్రసాదేమో ఈ తరంవాడే మరి! అయితే అతనిలో ఏవో కొద్ది పాత వాసనలు మిగిలి ఉన్నై. మేనమామ పోలికలంటారు. అతని మేనమామ – ఓయబ్బో – ఉద్దండుడు. ఆధునిక రచనా పద్ధతులన్నింటిలోనూ కసరత్తులు చేసి, గొప్ప పేరు ప్రతిష్ఠలు పొందినవాడై, అంతా యీ మధ్యనే కాలం చేశాడు. మేనమామంతటి గొప్పవాడయ్యే నమ్మకం ప్రసాదుకి స్వయంగా లేకపోయినా – అతని ప్రభావంవల్ల రచనా వ్యాసంగంతో పాటు కొందరు గొప్ప రచయితల రచనలపట్ల అభిమానమూ గురీ ఏర్పడ్డాయి.

'వడ్లగింజలు' అని ఒక కథ. వెనకటికి – దాదాపు – తను పుట్టకముందే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రాసినది – తన మేనమామగారి లైబ్రరీలో చూసి ఏనాడో చదివిన కథ. దరిమిలా ప్రసాద్ అదే కథనెన్నిసార్లు చదివాడో లెక్కలేదు. వేమన్నగారు పలికినట్టు ఒకటికి మరొకసారి చదివినకొద్దీ మళ్ళీ చదవాలనిపించడమే కాక కొత్త కొత్త భావాలు కూడా స్ఫురిస్తాయనిపించేదతనికి.

ఇంతకి, ఎదురుగా స్టేజిపైన భరతనాట్యం ప్రదర్శిస్తున్న దివ్యసుందర విగ్రహం, ఎవరోకూడా కాదు, ప్రసాదుకి స్వయానా ఆ మేనమామగారి కూతురే. తనకన్నా, అయిదేళ్ళేమో చిన్న. ఏదీ? తనకింకా పాతికేళ్ళన్నా నిండందే! రాత సరిగా ఉండిఉంటే తనకెప్పుడో పెళ్ళాం కావలసింది.

సాహిత్యరంగంలో 'ఒకే రెక్కల పక్షులు' కావడంమూలాన, ప్రసాదుకి మేనమామదగ్గిర చనువు జాస్తిగా ఉండేది. అప్పట్లో – ఎప్పుడనుకున్నారు? బాగా పది పన్నెండేళ్ళకిందటిమాట – ఆయన అంటూఉండేవారు – తనకిప్పటికీ చెవుల్లో రింగుమంటుంది. 'ఎప్పటికేనా మాచిట్టి నీ పెళ్ళామేరా! బెంగెట్టుకోకు!' అని. ప్రసాదులో అటువంటిదేదో బెంగ అప్పటికే స్పష్టంగా కనిపించిఉండాలి – పాపం, ఆ ముసలాయనకి.

ఎంత మేనమామ కూతురైనా, చిట్టిలాంటి అందకత్తెకి, నాట్యంలో అప్పటికే ఆరితేరిన ప్రజ్ఞావంతురాలికి, తనవంటి సర్వసామాన్యుడు, కేవలం ఒక పాత్రికేయుడు, ఇట్టే మొగుడైపోవడం, దైవమంతటివాడే చూస్తూ చూస్తూ వోర్చుకోలేడు. రాఘవయ్యవంటి రూపంలో ఎవడోన్ని ఒకబంటుని పంపి, అడ్డుపుల్ల వెయ్యమంటాడు.

వరలక్ష్మి – అంటే; అదే – చిట్టి –



ఆ పిల్లకి తల్లిదండ్రులు పెట్టిన పేరు – దాని పినతల్లికి భర్తగా ప్రత్యక్షమయిన రాఘవయ్య, చాలా దూరాలోచనలు గలవాడు. అయితేనేం, పాపం పిల్లల్లేరు. పుట్టిన యేడాది లోపునే తల్లిని పోగొట్టుకున్న వరలక్ష్మిని, (పుట్టిన యేడాదిలోపునే తను తండ్రిని పోగొట్టుకున్నట్టు!) భార్య ప్రోద్బలంకూడా ఉండటంవల్ల, తనే చేరదీశాడు. తల్లికూడా పోవడంతో, (తనతల్లీ పోయినట్టు!) ఆపిల్ల భవిష్యత్తు మీద సర్వాధికారాలూ తనవిగా చేసుకున్నాడు. వరలక్ష్మికి నాట్యంలో మంచిభవిష్యత్తు ఉండొచ్చునన్న సత్యాన్ని ఆ పిల్ల అయిదోయేటనే పసిగట్టగలిగినవాడతడొక్కడే! వరలక్ష్మి చేత బియ్యే ప్యాసు చేయించడమే కాకుండా, అటు భరతనాట్యంలోనూ, ఇటు కూచిపూడిలోనూ ప్రవీణురాలయేటట్టు చేయగలిగింది రాఘవయ్యే!

కూచిపూడిలో ఇప్పుడున్న వాళ్ళందరినీ మించిపోయే లక్షణాలు ఈ అమ్మాయిలో కనిపిస్తున్నాయంటూ బండా కనకలింగేశ్వర్రావుగారొకసారి చేసిన వ్యాఖ్య ఎక్కడో పత్రికలో చదివిన విషయం జ్ఞాపకమొచ్చింది ప్రసాదుకి.

తనూ బియ్యే పూర్తి చేసినవాడే. ఎందుకు పనికొస్తుందీ? వరలక్ష్మికి – అంటే చిట్టికి, నాట్యంలో తరిఫీదుకి కలిగినటువంటి అవకాశాలు, తనకు రచనావ్యాసంగంలో కలిగాయా మరి! దేనికైనా పెట్టిపుట్టాలిలే. నిరంజనరెడ్డి ఒక్కడున్నాడు తనపాలిటికి. అతని

ప్రోద్బలమే లేకుంటే తనీపాటికీ ఏ గుమాస్తా గిరిలోనో పడేవాడే.

"దరిద్రపు గుమాస్తాపని యేమిటోయ్. చక్కగా రాసేశక్తి ఉంది నీకు - ఉత్తరోత్తరా గొప్ప రైటర్ అయ్యే లక్షణాలు నీలో ఎన్నోఉన్నై. చదువుకున్నావుగా!" అన్నాడొకసారి రెడ్డి. అట్లా అన్నవాడత నొక్కడే.

తను పత్రికలో చేరకముందు - ప్రసాదు అప్పుడప్పుడు ఒకటీ అరా కథలు రాశాడు. ఒకసా రెప్పుడో రాజకీయాలమీదకూడా కొద్దిగా విరుచుకు పడ్డాడు.

ఏదైనా ఉద్యోగం - కనీసం గుమాస్తా - కోసం ప్రయత్నిస్తున్న రోజులవి.

"ఇక్కడి దినపత్రికవాళ్ళు మరొక రిపోర్టరుని చేర్చుకోవా లనుకుంటున్నారు - ఏదో ఇంతిస్తార్లే - ఫరవాలేదు. చేర్తావా ?.ఆ పత్రిక యజమానీ, ఎడిటరూ తెలిసినవారేలే. నీ పేరు చెప్పాను," అన్నాడు రెడ్డి.

"రిపోర్టింగు నాకాటే చాతకాదే! ఇరుకులో పడ్తానేమో సుమా!" అంటూ ప్రసాదు సందేహం వ్యక్తపరిచాడు.

"అభ్యాసం కూసు విద్యా - అదేం బ్రహ్మవిద్యకాదు. నే చెప్తా గా!" అన్నాడు రెడ్డి.

ఆ మర్నాడే తను ఈ ఉద్యోగంలో చేరింది కూడా. అన్నట్టు రెడ్డి ఇంతకీ వొచ్చాడో లేడో.

ప్రసాదు ఒకసారి యిటూ అటూ చూశాడు గాని, దూరానా ఆ మసగ చీకటిలో, ముఖాలు తెలీటం లేదు.

రాఘవయ్య చాలా గట్టివాడు. భగవంతుడి దూతలు - లేదా బంట్లు - కొన్ని ఓర్వలేని పనులకోసం అవతరించి, వాటిని అమలు జరుపుతున్నప్పటికీ, అటువంటి పనులు ధోకాలేకుండా సాగేటందుకు, తమకు తెలీకుండా కొన్ని మంచిపనులు కూడా చేస్తారు. ఏ మాట కామాటే చెప్పాలి మరి.

అయితే రాఘవయ్యా అంతటితో ఊరుకునే మనిషికాదు. ఏ నోటికైనా సరే సరిగా పలక తగ్గదిగా, ఒకసారి వింటే జ్ఞాపకముండి పోయేటట్టుగా ఉండాలని, ఆ పిల్ల పేరు కూడా 'వసంత'గా మార్చివేశాడు. అయితే నేం, చిట్టి అనే ముద్దుపేరులో ఉన్న మాధుర్యం, ఒకవిధమైన గుబాళింపు, ఒకసొగసు, ఒకానొక నాజూకు, ఒక ఆప్యాయత, ఆ పిల్లను వసంతగా ఊహించుకోవటంలోఎన్నటికీ ఉండదు ప్రసాదుకి.

డాన్సు మొదలెట్టి చాలా సేపయినట్టుంది. పక్కనే ఉన్న ఒకపాటి పరిచయస్థుణ్ణి కదిలించాడు ప్రసాదు.

"టైమెంత ?"

"అయిదు నిమిషా లుంది ఎనిమిదికి."

ప్రసాదు చేతికి గడియారంకూడా లేకపోవడం అన్యాయమే. ఈ మహా పట్నంలో రకరకాల చీట్లున్నాయి. రేడియోలూ, సైకిళ్లు, బీరువాలూ, రిస్టువాచీలూ, ఇంకా పోతే స్కూటర్లు, ఆడవాళ్ళకయితే, చీరలూ, స్టెయిన్ లెస్ స్టీలు సరుకులూ, అన్నింటికీ చీట్లు. అద్దె కొనుగోలులో ఇదో పద్ధతి. తతిమ్మా వాటిసంగతి, రాఘవయ్యగారనే దూతగారి బాస్ అయిన దేము డెరుగు. కనీసం, ఈసారి రిస్టువాచీకైనా ఒక చిట్ తీసుకోవాలి అనుకున్నాడు ప్రసాద్, రెడ్డితో మాట్లాడాలి.

స్టేజిపైన కొత్త 'అయిటమ్' ప్రారంభ మయింది.

రంగనాయిక!

మోహనరాగవర్ణం.

చిట్టి అభినయిస్తున్నది భరతనాట్య పద్ధతిలో.

అచ్చంగా రంగనాయిక ఇలానే ఉండే ఉండాలి.

"ఆ రోజుల్లో ఆమె అనుగ్రహం పొందినవా రెంత అదృష్టవంతులు!" అనుకున్నాడు ప్రసాద్.

ఈ వర్ణం ముగిశాక ఇంటర్వల్ ఉంటుంది. బయటకుపోయి రెడ్డికోసం గాలించాలి వొచ్చాడో లేడో. రాకుండా ఉండడు. ఏం పనితగిలిందో! సిగరెట్టు కాల్చాలి. ప్రసాదు జేబు తడుముకున్నాడు. అగ్గిపెట్టె మటుకే ఉంది. ఆఖరి సిగరెట్టు, హాలులోకి రాకమునుపే కాల్చివేసిన సంగతి జ్ఞాపక మొచ్చింది. బయట దొరుకుతె-కొనాలి.

మర్నాటి పత్రికలో మంచిరిపోర్టు రాయటానికి పనికొచ్చేలాగా, స్టేజిలోనికి – అంటే గ్రీన్ రూంలోనికి పోయి, చిట్టిని – అనగా 'వసంత'ను పలకరిస్తే? ఇంటర్వ్యూ!!

చిన్నతనంనుంచీ తను ఎరిగిన, నిజానికి తన కీపాటికి భార్య కావలసిన చిట్టితో ఇంటర్వ్యూ!

రెడ్డితో కన్సల్టు చేయాలి.

ఎంత విచిత్రమైన అనుభవం అది!

అది సరేగాని, అంతా అనుకున్నట్టే జరిగి, చిట్టి తనకు భార్యే అయివుంటే, నాట్యంలో యీపాటికంత పేరు వచ్చేదా? ఏం? ఎందుకు రాకూడదూ? ఆ పిల్లతోపాటు తనకూ పేరు ప్రతిష్ఠలు వచ్చేవేమో!

చిట్టి – ఎంత అందమైన విగ్రహం! వర్ణంలో స్వరం వేస్తున్నప్పుడు చిట్టి రొమ్ముల కదలిక పిచ్చెత్తించింది ప్రసాదుకి.

తనకోసం ఆ స్వరం మరొక్కసారి వెయ్యరాదా? అనుకున్న ప్రకారం ఆ పిల్లతో తనకు పెళ్ళయి ఉంటే, ఏకాంతంగా, ఎన్నిసార్లు అదేస్వరం వేయించుకొని, ఆ కదలికలు తనివి తీరా ఆనందించేవాడో!

ఎంత తీర్చిదిద్దిన విగ్రహం! అందుకే మరి, నాట్యంలో అంతగా రాణిస్తున్నది!

పారిస్ నుంచి, లండనునుంచి, అమెరికానుంచి పిలుపులు!

కొద్ది రోజులలోనే చిట్టి, అంటే, వసంత అనే పేరుతో బ్రహ్మాండమైన పబ్లిసిటీ అందుకుంటున్న చిట్టి, విదేశ పర్యటనకై బయల్దేరవలసి వుందని విని ఉన్నాడు ప్రసాదు. ఆ పర్యటనకు ముందు, కొన్ని పెద్దపట్నాలలో ఆహూతుల సమక్షంలో, వీడ్కోలు ప్రదర్శనాల వంటి విది.

పదిపన్నెం డేళ్ళకిందట, తనకు పదకొండో, పన్నెండో - ఏడెనిమి దేళ్ళ చిట్టి, పరికిణీతో, జాకెట్టుతో, గిరగిరా తిరిగితే, అప్పటికే తనతెలిసీ తెలీనికళ్లు చెదిరేవనిపించేది. ముఖ్యంగా ప్రసాదుకి, ఆ పిల్లకళ్ళల్లో ఆకర్షణ అంతా ఉందనిపించింది. అప్పటికీ, ఇప్పటికీ, అవేకళ్ళు!

"దాని అదృష్టమంతా కళ్ళల్లోనే ఉందిరా!'' అనేది ప్రసాదుతో, వాళ్ళమ్మ బతికున్నప్పుడు.

"అమ్మ బతికుంటే, చిట్టి డాన్సు చూసి, ఎంత మురిసేదో!" అనుకున్నాడు ప్రసాదు.

స్వరంతో వాళ్ళంతా జలదరిస్తూ, తనవొళ్ళె జలదరింప చేస్తున్నది చిట్టి. ఆమె శరీరంలో వొంపులన్నీ కూడా అవేస్వరాలు పలుకుతున్నాయి. నడ్డిమీద చేతులు ఆన్చి, భుజాలు కదిలిస్తున్నప్పుడు, రొమ్ములు పరస్పరం ఆటలాడుకుంటున్నై.

చిట్టి ఎంత పెరిగింది!

ప్రసాదుకి వాళ్ళంతా కళ్ళుంటే ఎంత బాగుంటుం దనిపించింది.

ఇవాళ్ళ చిట్టి, ఎప్పటికన్నా గొప్ప 'ఫారమ్'లో ఉందనిపించింది.

తననే గమనించి 'ఫారమ్'లోనికొచ్చిందో!

ఏమిటో పిచ్చి తనకు!

నిజంగా అమ్మ ఉంటే ఎంత ఆనందించేది! అసలు అమ్మ ఉంటే చిట్టి తన కింత దూరమవుతుందా? అమ్మ మటుకు ఏం చేయగలదని? అప్పుడప్పుడు అమ్మకు ఏదో దిగు లొచ్చి, 'నీ అదృష్ట మెలా ఉందో నాయనా!' అనేది!

తన అదృష్టం, యిట్లా 'పాత్రికేయం'గా ఉండబోతుందని ఆ తల్లికి ఏనాడో తెలిసే ఉండాలి!

ఒక పాత్రికేయునికి. ఒక భరత నాట్యప్రవీణురాలు పెళ్లామౌతుందా! కల్లోమాట!

ఆ రోజుల్లో అయితే, చిట్టి తో మాట్లాడని ఘడియ ఉండేదికాదు. ఆ పిల్లకు తనమీద బాగా మనసుందని, తనకు రకరకాలుగా తెలుస్తూనే



ఉండేది. అప్పటివన్నీ మరీ చిన్నతనపు మాటలు!

"ఏమే–నన్ను పెళ్ళాడతావులే ?"

"ఎందు కాడనూ?"

"మరి నువ్వు డాన్సు చేస్తూనే ఉంటావా?"

"ఎందుకు చేయనూ? ఏం? నీకు బాగుండదా ?"

'నీకు బాగులేకపోతే మానేస్తాలే' అని కాబోలు భావం !

"ఎందుకు బాగుండలా! నువెప్పుడూ డాన్సు చేస్తూనే ఉండాలి మరి!"

'నన్ను చేసుకుంటే నీ డాన్సుకేమీ అడ్డురాను' అని తనభావం !

చిన్నపిల్లల మాటలలోకూడా, ఏదోభావం ఉండనే ఉంటుంది. ఆ భావం చిన్నపిల్లలకు కూడా స్ఫురిస్తుంది!

"మరి నువేం చేస్తావుట?" భవిష్యత్తు గురించి అప్పుడే ఆలోచన!

"నేనేదైనా పెద్దవుద్యోగం చేస్తూ ఉండనా? నువు చెయ్యొద్దంటే చేయనేమో మరి!"

'నువు నాకు ఎంతచెపితే అంత' అని కాబోలు తనభావం!

ఇల్లాంటి 'అర్థంలేని' డైలాగులు, సాగుతూనే ఉండేవి. ఏమంతగా జ్ఞాపకం లేవు ఇప్పుడు. అయినా, ఆ పిల్ల మనసు తనమీదే ఉందని, ఎవరో హామీ యిచ్చినట్టుగా నమ్మకం ఏర్పడిపోయింది ప్రసాదుకి. కాని, ఏనాడైతే తల్లి గతించిందో ఆ క్షణం నుంచే చిట్టి కూడా తనకు దూరమైపోతున్నదని

అనిపించింది తనకు. అందుకు తగ్గట్టుగానే చిట్టి, డాన్సులో, పెద్దపెద్ద పాత్రాలలో పడ్డప్పట్నుంచీ, ఈనాటి వరకూ తాను ఆ పిల్లను కలుసుకున్న అవకాశాలు వేళ్లపైనే లెక్కపెట్ట వచ్చు.

చదువు పూర్తయిందనిపించుకునే దాకా, ఆ ఇంట్లో తను ఎట్లా గడిపిందీ భగవంతుడి కెరుక. రెడ్డి ధర్మమా అంటూ ఈ రిపోర్టరు పని దొరకడమే వ్యవధిగా, ప్రసాదు వేరయిపోకనూ తప్పలేదు.

స్టేజిపైన హఠాత్తుగా తెరపడింది హాలులో లైట్లన్నీ వెలిగినై. మైకులో ఎవరో అన్నారు–పదినిమిషాలు ఇంటర్వెల్.

ప్రసాదు గబగబా జనాన్ని తోసుకుంటూ బయటకు వచ్చాడు. ఎక్కడా రెడ్డి కనపడలేదు. టీ కాఫీలు అమ్మే చోట జనం మరీ ఎక్కువగా ఉన్నారు. టీ కోసం ప్రసాదు జనాన్ని తోసుకుంటూ ముందుకు వెళ్ళబోయినాడు.

"హల్లో ప్రసాద్!"

"వోర్నీ–ఎంత వెతికినా కనపడ్డావు కాదు! ఎక్కడా?" అన్నాడు ప్రసాదు.

"ఈ కప్పు పుచ్చుకో. మరొటి తెస్తాను."

ప్రసాదు కప్పు పుచ్చుకొని బయట పడ్డాడు.

"మాంచి రైటప్ రాసేట్టున్నావే, నీ వాలకం చూస్తే! ఏం?"

ప్రసాదు నోటినుంచి కప్పుతీస్తూ చిరునవ్వు నవ్వాడు.

"ఎక్కడ కూర్చున్నావ్? నీకోసం చాలా వెతికాను!"

"అయిదింటికి ఒక ప్రముఖ నటుడు అర్జంటుగా ఆఫీసుకే ఫోనుచేసి, ఉన్న పాళంగా స్టూడియోకి రమ్మన్నాడు. అక్కడనుంచి వచ్చేసరికి ఏడున్నరయింది. వెన కెక్కడో ఇరికాను."

"ఏం కథ?"

"ఏం లే. వాళ్ళు తీస్తున్న పిక్చరు ఆఖరి షూటింగ్. అప్పటికప్పు డనుకొని పార్టీ యిచ్చారు. పిలుపులన్నీ ఫోను మీదనే. ప్రముఖ నటులిద్ద రున్నారు. వాళ్ళలో వాళ్ళకు ఏం పాలిటిక్సున్నా ఇద్దరూ మరి నా క్కావలసినవారే! వెళ్ళక తప్పలే. ఏమంటావు? నిన్ను కూడా తీసుకుపోదా మనుకొని, మీ ఆఫీసుకి ఫోనుచేస్తే, నువు అప్పుడే వెళ్ళిపోయావన్నారు. పోతూ తోవలో ఇక్కడ చూశాను. లేవు. లైమైపోతోందని పోయినాను."

"పిక్చరు గురించి రాస్తున్నావా?"

"మరి రాయొద్దా! పత్రిక నింపాలి కద! దానికేం గాని, ఇవాళ మాంచి 'ఫారమ్'లో ఉన్నట్టుం దీవిడ! త్వరలోనే అమెరికా వెళ్తున్నదటగా!"

"అనుకుంటాను!" అన్నాడు ప్రసాదు.

"అందులో నువు కనిపించావను కుంటాను!"

"ఎట్లా కనిపిస్తాను? కనిపిస్తేనేం?"

"మాంచి ఫారమ్!"

"నువ్వొకడివి. నాకన్నా పిచ్చి వూహాలు! ఇదేమన్నా సినిమా కథ అనుకున్నావా?"

"సినీమా కథ లెక్కడా జరగవు. ఇట్లా జరిగేవి సినీమా కథలకు ఏమీ పనికిరావు! నీకు తెలీదా ఏమిటి?"

రెడ్డికి మాటల్లో చమత్కారమూ, రాతలో చమత్కారమూ కూడా ఉన్నాయి. చాలామంది కన్న బాగా రాస్తాడు అతని విమర్శలన్నా వ్యాసాలన్నా ప్రసాదుకి ఇష్టం కూడా. కాని, ఏం రాస్తే ఈ రోజుల్లో ఎవడికాృ

వాలి? భుక్తి గడవటం తనవంటి వాడికి ప్రధానం; రెడ్డికి కాకపోయినా. ఎవడు చూసొచ్చాడు రేప్రొద్దున్న అమాంతంగా ఒక సినీ రచయితే అయిపోవచ్చు రెడ్డి. అయినవాళ్ళంతా ఇతనికన్న ఊడబొడిచారా; ఆ మాట కొస్తే తను?

"ఈమె సినీమాలలో కూడా డాన్సు చేస్తే బోలెడంత భవిష్యత్తుందని రాయబోతున్నావల్లే ఉన్నదే!" అన్నాడు ప్రసాదు.

"ఏం తప్పా? నీ కట్లా అనిపించ లేదా?"

"తప్పనటం లేదు. అల్లా నే రాయమంటున్నాను. నాగేశ్వర్రావు దగ్గర అప్పుడే ఒకమాట వేసేపుంటా వీపాటికి!"

"ఆ పని నిన్నడిగి చేద్దామనుకుంటున్నాను. అది సరేగాని, ఈ పిల్ల నీ మేనమామగారి కూతురే కదా..."

"కాదన్నానా?"

"మంచి అవకాశం జారవిడుచుకుంటున్నా వనుకుంటున్నాను–"

"ఏదో శాస్త్రం చెప్పిన తరవాయిగా ఉంది. సిగరెట్టివ్వు." ఇద్దరూ సిగరెట్లు ముట్టించుకున్నారు.

"అవున్లే, అదీ నిజమే. ఆమెకు మేనేజరుగా రున్నారుగా – నాకంతా తెలుసులెద్దూ!"

రెడ్డి కంతా తెలుసు. తానే చాలా వరకూ ఏదో మాటలో మాటొచ్చి చెప్పా డొకసారి.

"సరేగాని, లోనికిపోయి ఒకసారి ఆమెను కలుద్దామా?"

"చూ ద్దాం పద," అన్నాడు ప్రసాదు.

గ్రీన్ రూం అంతా జనంతో నిండి ఉంది. ఇద్దరూ తోసుకుంటూ లోనికి వచ్చారు.

చిట్టి స్టేజిపైన వివిధభంగిమలలో పోజు లిస్తూ ఉండడం గమనించాడు ప్రసాదు.

చుట్టూ నలుగు రైదుగురు ఫొటో గ్రాఫర్లు, అన్నీ అమర్చుకొని సిద్ధంగా ఉన్నారు. వారిలో ఒకడు విదేశీయుడల్లే ఉన్నాడు. ఒక్కొక్క రే ఒక్కొక్క కోణంనుంచి కళ్లు జిగేలు మనిపించేటట్టు, ఫ్లాష్‌లు కొడుతూ ఫొటోలు తీస్తున్నారు.

"అవతలివాడు – నాలుగు కేమేరాలు–చూడు, 'లైఫ్' ఫొటోగ్రాఫరు. ఇదివరకు నువు చూడలే దనుకుంటాను. మొన్నొకసారి స్టూడియోలకొస్తే తెలిసింది."

"'లైఫ్'లోకూడా ఫొటోలు పడ్తా యన్నమాట!" అన్నాడు. ప్రసాదు కొద్దిగా ఆశ్చర్యపోతూ.

తరవాత ఒక గ్రూప్ ఫొటో ఏర్పాటయింది. చిట్టీ, రాఘవయ్యా, వారిద్దరిమధ్య ప్రసాదుకి తెలీని మరొక వ్యక్తి.

''ఇక నేం!'' అన్నాడు రెడ్డి.

''అంటే?''

''నే ననుకున్నదే. ఆ మధ్య చూడూ. అతని గురించి నా కెందు కో అనుమానం కలిగిందిస్మా! నీతో చెప్ప లేదు. తరవాత చెప్తా,'' అన్నాడు రెడ్డి.

రెడ్డి, ఆవులిస్తే, కొన్ని పేగులైనా లెక్క పెట్టగలడు. తనకింకా ఆ మాత్రం కూడా చాతకాలేదు. ఏదీ, ఆరెన్నెల్లే కదా పత్రికానుభవం!

ఫొటోలు తీయడం అయింది.

ప్రసాదు చిట్టిని సమీపించాడు. పక్కనే రెడ్డికూడా ఉన్నాడు.

'రంగనాయిక' వంట మేకప్‌లో చిట్టి ధగధగ మెరిసిపోతున్నది.

''చిట్టీ!''

''వొచ్చావా బావా?''

చిట్టి ఒక్కసారి గతుక్కు మన్న ట్టనిపించింది ప్రసాదుకి. అంతలోనే ఆమె కళ్ళల్లో తనకు మాటలతో చెప్పటానికి వీలుపడని దైన్యం కని పించింది.

"ఇవాళ చాలా బాగా చేశావుచిట్టీ! అది చెప్పటానికే వొచ్చాను!" అన్నాడు ప్రసాదు.

"నిన్ను గమనించాను!" అన్నది చిట్టి.

"ఇతను రెడ్డి - నిరంజనరెడ్డి. నా స్నేహితుడు. సినిమాపత్రిక ప్రతినిధి."

"నమస్కారం."

"మీ రివాళ గొప్ప 'ఫారమ్'లో ఉన్నారు. ఎప్పుడు వెళ్ళడం ఫారిన్?" అన్నాడు రెడ్డి.

చిట్టి, ఒకనిమిషం మౌనంగా ఉంది. సమాధానం ఇచ్చేలోపున రాఘవయ్య గారు ముందు కొచ్చారు. ప్రసాదుని చూసీచూడనట్టుగా నటించి -

"ఏదీ, కొద్దిరోజులలోనే ఫైనలై పోతుందిలెండి," అన్నాడు.

ప్రసాదు ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు రెడ్డి ఆ నిట్టూర్పు గమనించాడు.

"మీతో ఒకముఖ్యమైన విషయం మాట్లాడాలి.. మీ డాన్సు విషయమే ననుకోండి. రేపు రావొచ్చా?"

"తప్పక. ముందు ఫోను చేయండి. అమ్మాయ్, పద. లైటైంది!"

"నువుకూడా రారాదా బావా! చాలాకాల మయిందిగా?" అన్నది చిట్టి పోతూపోతూ.

"ఇద్దరం ఒస్తాం," అన్నాడు రెడ్డి.

డాన్సు ఉత్తరార్థంలో ప్రసాదూ, రెడ్డి పక్క పక్కనే కూర్చున్నారు. కాని ఈసారి వారిద్దరిదృష్టి డాన్సు మీద ఆకేలేదు.

"ఫొటోతీయించుకోడానికి ఆ అమ్మాయి పక్కనే నిలబడ్డవాడు గుర్తుందా? ఫారిన్ ట్రిప్ స్పోన్సార్ చేసి, మెల్లగా ఇక్కడినుంచి దాటించి, అమెరికాకు పట్టుకుపోయి, అక్కడ ఆమెతోసహా సెటిల్ అయిపోదా మనుకుంటున్నాడు. తెలీకుండా ఉండి పోతాయా?" అన్నాడు రెడ్డి.

ప్రసాదు అయోమయంగా చూశాడు.

"నీ కెట్లా తెలిసింది?" అన్నాడు.

"పత్రికలో పని చేస్తున్నావు - ఆపాటి కూపీ లాగలేవా? నే నలాగే శాను."

"ఎట్లా?"

"ఆమధ్యసారథిలో, ఏదో మహూర్తపు షూటింగు-ఆలూ చూలూ లేని కథ-అంటే పేరు పెట్టలేదు. అక్కడ పార్టీకి పోతే, ఈ పెద్దమనిషున్నాడు; బాగా డబ్బుతో మదించిన వాడట. ఫిల్ము తీయటానికి కొంత డబ్బుకూడా యిచ్చా డంటారు. అమెరికావాసి. ఎప్పుడో పోయి అక్కడే డాలర్ల తయారీలో వుండిపోయినాడు - మాట్లాడాల్లే పది నిమిషాలపాటు. అక్క డుండవల సిన శాస్త్రి. మొత్తానికి మీ రాఘవయ్య గట్టివాడు. ఉద్దండుడల్లే ఉన్నాడు. ఇత



గాణ్ణి పట్టేశాడు. వసంత వుందిగా! ఆ పిల్లమీద కన్ను పడింది వీడికి. ఇక మిగతా కథ ఎవరూ చెప్పనక్కర్లేదుగా!" అన్నాడు రెడ్డి.

"కథ చాలా దూరం వెళ్లిందే!" అన్నాడు ప్రసాదు ఏదీ పాలుపోని స్థితిలో పడి.

"నీ కింకా ఆ పిల్లమీద ఆశ మిగిలి వున్నట్టుందే!"

"ఆశల కేం? ఆకాశా లంటుతై. తీరొద్దూ?" అన్నాడు ప్రసాదు. ప్రసాదు మాటలలో రెడ్డికి ఊహించలేనంత జాలి కనిపించింది.

"కాని, చాలా అన్యాయంతే. చూద్దాం; ఏమవుతుందో!"

"ఏమిటి చూసేది?"

"డాన్సు చూడు. తరవాత మాట్లాడదాం," అన్నాడు రెడ్డి.

తొమ్మిదిన్నరకు డాన్సు అయిపోయింది.

"నేను చాలా దురదృష్టవంతుణ్ణి. అయినా నాలో ఏం చూసుకుని అత్యాశలకు పోయేది?" అన్నాడు ప్రసాదు.

"ఇంకొకటికూడా జరిగింది. నాగేశ్వరావుగారు ఈ పిల్లని చూశారు. తమ పిక్చరులో డాన్సుకి బుక్ చేస్తామన్నారు. ఆ పిల్ల సరే అంది. కాని పేచీవచ్చింది."

"నువు నా కన్నీ కొత్తకొత్త విషయాలు చెపుతున్నావు!"

"ఒక సంవత్సరానికి కాంట్రాక్టు రాయమన్నారు. అతగాడున్నాడే - అడ్డుపుల్ల వేశాడు, అమెరికా వెళ్లిపోవటానికి-అంటే 'ఫారిన్ టూర్' పేరుతో ఆటంకం కలుగుతుందని గ్రహించాడు. అతను వొప్పుకోలేదు. మీ రాఘవయ్య

కూడా వొప్పుకోలేదు. న్యాయమే కదా!''

ఇద్దరూ రోడ్డుమీది కొచ్చారు.

''ఈ రాత్రికి నా గది కొచ్చేయి,'' అన్నాడు ప్రసాద్.

''వొచ్చేద్దును. కాని తెల్లారగానే వేరే పనుంది; రేపొస్తా,'' అంటూ రెడ్డి వెళ్ళిపోయాడు.

ప్రసాదు హోటల్ కి పోయి ఇంత తిని, తన గదికి బయల్దేరాడు.

ఆదర్శనగర్ లో ఒక మేడమీద కేటాయింపుగా ఉన్న ముందుగది అద్దెకు తీసుకొని ఉంటున్న ప్రసాదుకి ఆ రాత్రి సరిగా నిద్రపట్టలేదు. రెడ్డి ఎంతకేనా తగినవాడు. మర్నాడు చిట్టిని కలుస్తా మనటంలో అతని ఉద్దేశ మేమిటోకూడా ప్రసాదుకి తట్టలేదు.

ఏది ఎట్లా ఉన్నా, ప్రసాదుకి ఇంకా ఆ క్షణం వరకూ చిట్టిపైన ఆశపోలేని మాట నిజమే. తన చేయి ఏ నాడో జారిపోయింది. అదీ నిజమే. రెడ్డి చెప్పినట్టు, ఆ పిల్ల, వా డెవడో - వాడితోసహా విదేశాలకంటూ పోయి తిరిగి రానంతవరకూ ఈ ఆశ పీకుతూనే ఉంటుంది. చిట్టికి మట్టుకు ఇట్లానే ఉండదా? ఉండకపోవడం, ఎందుకో అసంభవం అనిపించింది తనకు. ఆ పిల్ల మనసు తనకు చిన్నతనంనుంచీ తెలుసు. అవకాశం దొరకాలిగాని, తెగింపు ఉండదా?

మర్నాడు సాయంకాలం అయిదింటిదాకా రెడ్డి పత్తాలేదు. ప్రసాదుకి అయిదు దాటాక ఆఫీసుకి ఫోన్ వచ్చింది -

''వెంటనే గోపీహోటల్ కి రా, నీ కోసం ఎదురుచూస్తున్నా,'' అని. ఫోను పెట్టేశాడు రెడ్డి. గోపీలో కాఫీ పుచ్చుకుంటూ రెడ్డి చెప్పాడు.

''ఈ వేళంతా నాకు నీ విషయం లోనే పని!''

''నా విషయంలోనా?'' అన్నాడు ప్రసాదు ఆశ్చర్యపోతూ.

''చెప్తా విను. మధ్యాహ్నం వాళ్ళింటి కెళ్ళాను - మీ రాఘవయ్యగారింటికి. నిజానికి రాఘవయ్యగారితోనే మాట్లాడాలని వెళ్ళాను, వసంత ఫిల్ము కాంట్రాక్టు గురించి నచ్చ చెప్పటానికి. అదృష్టవశాత్తు ఆయన లేడు. వసంతా, ఆమె పిన్నీ ఉన్నారు. మాటల్లో పెట్టేశాను; పసికట్టాను. అవిడకు ఆ పిల్ల మీదే ఉన్నాయి పంచప్రాణాలూ. విదేశాలకు పోవడం ఇద్దరికీ యిష్టం లేదని తెలిసిపోయింది. అమ్మాయికి మైనారిటీ ఎప్పుడో తీరింది గనక కాంట్రాక్టుపైన సంతకం పెడితే, ఆ బెడద తప్పుతుందన్నాను. ఆ పిల్లకు ఎంత ధైర్యం మొచ్చిందనుకున్నావు! వెంటనే సంతకం పెట్టింది!''

''కాంట్రాక్టు ఫారా లెక్కడివి?'' అన్నాడు ప్రసాదు ఆశ్చర్యపోతూ.

"నాగేశ్వర్రావుగారు ఇచ్చారు. అంటే నేనే లాక్కొచ్చాను. నీ ఉద్దేశం నాదీ! ఇక విదేశయాత్ర సున్నా. ఆ రాఘవయ్య లబోదిబో మంటాడు. ఇక పోతే, ఆ రాఘవయ్యా, అమెరికా వాసీ, ఇంకా కొందరూ 'త్రీ ఏసెస్' లో మాంచి పట్టులో ఉన్నారు. బహుశా రాత్రికిగాని రారు. నాకు తెలిసిన టాక్సీ ఒకటి మాట్లాడి ఉంచాను; చెప్తాలే. రేపు తెల్లవారు జాము మూడింటికి రడీగా ఉండు; నే నొస్తాను. పదిరోజుల శలవు రాసి పడేయి."

"నా కంతా అయోమయంగా ఉందిలే."

"అయోమయంగానే ఉంటుంది నీ స్థితిలో. నే చెప్పినది మరచిపోకు. అదృష్టం తన్నుకొస్తోంది పో," అన్నాడు రెడ్డి.

ప్రసాదుకి రాత్రి నిద్ర లేదు. గంటలు లెక్కపెడ్తున్నాడు. ఒంటి గంట, రెండు, మూడు...

టాక్సీ ఆగిన చప్పుడయింది.

"సిద్ధంగా ఉన్నావా?" అన్నాడు రెడ్డి గదిలో కొస్తూ.

"పద" అన్నాడు ప్రసాదు.

ఇద్దరూ టాక్సీ ఎక్కారు. పది నిమిషాలలో రాఘవయ్యగారింటిముందాగింది టాక్సీ.

రెడ్డి దిగి లోనికి వెళ్ళాడు. అయిదు నిమిషాలలో తిరిగొచ్చాడు. వెనకనే చిట్టి – ఆ వెనక ఆమె పిన్ని!

చిట్టి టాక్సీ ఎక్కింది. ప్రసాదు పక్కనే కూర్చున్నది. రెడ్డి ముందు సీట్లో డ్రైవరు పక్కనే కూర్చున్నాడు.

"సుఖంగా వెళ్ళిరండి నాయనా! మీ రేమీ బెంగ పడకండి. నే చూసుకుంటాను," అన్నది చిట్టి పిన్ని.

టాక్సీ కదిలింది.

"ఏం బావా!" అన్నది చిట్టి.

"ఎక్కడికి పోతున్నాం?" అన్నాడు ప్రసాదు.

"విజయవాడ. ఆ తరవాత వీలుంటే మద్రాసొకసారి."

* * *

"స్వయంగా రాజుచేత గజారోహణ చేయించుకున్న తంగిరాల శంకరప్పకి తోడుగా, వెంటనే వింజామర చేత పుచ్చుకొని 'రంగనాయిక' కుటుంబ మేను గెక్కేసింది."